పరివర్తనము

కనుపర్తి రామకోటయ్యా వౌదరిగారు

౧

రైలు ఈలవేసి నెమ్మదిగా కదలిపోతూయుంది. స్త్రీలపెట్టెలో కూర్చునియున్న రక్షాదేవి మొగముపైనున్న ముసుగును కొంచముతొలగించి వెలుపలివైపుకు చూచుచూ వియోగవిహ్వలహృదయముతో యొక నిట్టూర్పువిడిచింది. ఆమె తలవంచి "మరల నేనెప్పుడువచ్చెదనో? ఈసమయములో మానాయన వసారాలో కూర్చుని హుక్కాత్రాగుతూయుంటాడు. మాతల్లి వంటచేస్తూయుంటుంది. నాచిన్నితమ్ముడు ఆడుకుంటూయుంటాడు"అని భావించింది.

రక్షాదేవికి తనతల్లిమాటలు ఒక్కొకటి జ్ఞాపకమొచ్చినప్పుడు అధీరయై పోవుచున్నది. ప్రయాణసమయములో తల్లితనను ఏవిధముగా కౌగలించుకొని ప్రేమించినదియూ, ఏవిధముగా వెక్కివెక్కి ఏడ్చినదియూ, ఆమె తనభర్తతో "నాయనా! నేటినుండి నీచేతులలో నొప్పగించుచున్నాము. ఈరోజునుంచి యీమెపై మాకు హక్కులేదు" అని చెప్పుసమయములో నామె కంఠస్వరమెంత కంపించిపోయినదియూ, "రక్షను మేమెంతయో ప్రేమగా పెంచుకున్నాము. ఆమెమనస్సును దుఃఖపెట్టవలదు"అనిపల్కు తనతల్లిదీనవాక్యములును తలచుకుని ఆమెమనస్సు నిండిపోయినది. ఆమె తనతలను ఆకొయ్యాగోడకుఆనించి ఏడ్చుట మొదలుపెట్టింది.

బండి వేగంగావెళ్ళుతుంది. రక్ష తన హృదయమును కుదుటకేర్చుకుని ముసుగును కొంచెముతొలగించి యిటునటుజూచింది. ఆపెట్టెలో మరొకస్త్రీయుంది. ఆస్త్రీవయస్సు ఇరువదిరెండో, యిరువదిమూడోసంవత్సరములుంటవి. తెల్లనిరంగు, గుండ్రనిమొగము చాలా చక్కగాఉంది. ఇంతలో ఆమెగూడా యిటు చూచింది. రక్షాదేవి ఆశ్చర్యపడ్డది. ఈమె సావిత్రి. తనగ్రామములోనే నివసించేది. ఆమె పెండ్లిఅయి ఇప్పటికి నాలుగేండ్లయింది. ఈకొద్దిసమయంలోనే ఎంతమార్పయింది? పల్లెటూరిపిల్ల అనుకొనుటకే వీలులేదు. ముఖముపై ఎంతగంభీరత? ఎంత ప్రతాపము? రాణీలాగాఉందే? రక్ష కొంచముసేపటివరకూ చూస్తూయుంది. తరువాత లేచి ఆమెవద్దకువెళ్ళి "ఆహా! సోదరీ! ఇంతలోనేనన్ను మరచితివా?" అందిచిరునవ్వుతో.

సావిత్రి ఆమెవంకజూచింది. వెంటనే కౌగలించుకుని "ఓ నాప్రియరక్షా! నీవెక్కడనుండివచ్చేవు? (చిరునవ్వుతో) ఈమూల పెద్దపార్శిల్ లాగాపడివుంది, అందులోనుంచివచ్చేవా? మరల నన్నొకసారి కౌగలించుకో (కౌగలించుకున్నతర్వాత) ఓనాపార్శిల్! ఎక్కడకుపోవుచున్నావు?" అంది.

రక్ష:—నీపార్శిల్ కు వివాహమైంది.

సావి:—ఈవిషయం స్పష్టంగానే తెలుస్తుంది. కాకపోతే! ఈవిధంగా ముసుగువైచుకొని పార్శిల్ (మూట)లాగా ఒకమూల పడియుండేదానవేనా? ఇదే మొదటిసారి అత్తగారింటికిపోవటం అనుకుంటాను.

రక్ష:—అవును, సోదరీ! ఇదే మొదటిసారి. పెండ్లిఅయి రెండేండ్లయింది. మనుగుడుపుయిప్పుడైంది.

సావి:—ఎక్కడ వివాహమైంది?

రక్ష:—(తలవంచి నెమ్మదిగా) సయాల్ కోటలో.

సావి:—మరదిగారేమిచేయుచున్నారు?

రక్ష:—లాహోరులో నౌకరీచేయుచున్నారు.

సావి:—లాహోరులో? (చిరునవ్వుతో) అయితే పరస్పరసమ్మేళనముజరుగుతూయుంటుంది. మేము గూడా అక్కడేయున్నాము. మరదిగారెట్లాయుంటారు? అందవిహీనులు కాదుకదా?

940

రతి:—(తలవంచి నెమ్మదిగా) నాకేమి తెలుస్తుంది? ఇంతవరకూ వారివంక సరిగా తలఎత్తిఅయినా చూడలేదు.

సావి:—ఆయన జనంలో కలిసిపోయి కాన్పించకుండాయుంటే ఎట్లా వెతుక్కుంటావు?

రతి:—నిన్ను పిలవనంపుతాను. వచ్చేదవా?

సావి:—నీవు భక్తితో పిలచినట్లయితే తప్పక వస్తాను.

రతి:—మంచిది, నీవిషయం వినుపించు. ఏమిటి పరిస్థితులు?

సావి:—సోదరీ! పరమాత్ముని కృపచే ఏవిధమయిన కష్టము లేదు. వకీలుపని చేస్తున్నారు. నెలకుమూడు నాలుగువందలరూపాయీలవరకూ రాబడి. వారిస్వభావం ఇంతమంచిదని ఏమిచెప్పేది? ముఖము ఎల్లప్పుడూ గులాబీలాగా వికసించియుంటుంది. కోపపడటం ఎటువంటిదో ఎరుగరు. నాకు సంపూర్ణస్వాతంత్ర్యం యిచ్చేరు. ఎక్కడికైనా, ఎప్పుడైనా పోతాను, వస్తాను. ఏవిధమైన అభ్యంతరములేదు.

రతి:—అయితే నీవు దొరసానిలాగా బజార్లవెంట తిరుగుతుంటావా?

సావి:—(చిరునవ్వుతో) బహుశా నీకు తెలియదుకాబోలు. ఘోషా ఆయనకు అసలు పనికిరాదు. (పెట్టెలోనుంచి ఒక పుస్తకంతీసి) ఇదిచూడు. వారొక పుస్తకం వ్రాశారు. ఇందులో ఘోషాపద్ధతి చాలా మూర్ఖమైందనిన్నీ, స్త్రీలకు చాలా హానికరమైందనిన్నీ సిద్ధపరిచారు. దీనిని ఆద్యోపాంతంగా చదువు. అప్పుడు నీకళ్ళు తెరవబడతవి.

రతి:—(పుస్తకముతీసుకుని) అయితే నీకుగూడా తెల్లవాళ్ళగాలి సోకిందా?

సావి:—(చిరునవ్వునవ్వి) నాకు మొదటినుంచి ఘోషాపద్ధతి రుచించదు.

రతి:—అయితే ముఖమెత్తుకుని బజార్లవెంట తిరుగుతూయుంటే సిగ్గుగా ఉండదా? ఎవరైనా మనవాళ్ళుచూస్తే ఏమనుకుంటారు? నేనుచచ్చినా ఇటువంటి లజ్జాహీనమైనపనికి వప్పుకోను.

సావి:—నీకు మరొక కబురు వినుపించుతాను. వారొకసొసైటీని స్థాపించేరు. సంఘోద్దేశము ఘోషాపద్ధతి నిర్మూలించుట. ఈవిషయాన్నిగురించి పంజాబులో చాలాచోట్ల ఉపన్యాసాలిచ్చేరు. వచ్చేనెలలో సయాల్ కోటగూడావస్తారు. నీవురమ్మంటే నేనుగూడావచ్చేదను. కాని ఒకషరతుంది.

రతి:—ఏమిటి?

సావి:—నీవు నిండుసభలో "ఈఘోషాపద్ధతి చాలాఘోరమయింది. ఇది స్త్రీలకు చాలా హానికరమయింది" అనిచెప్పాలి.

రతి:—నావల్ల ఆయాశపెట్టుకోవద్దు. కాని కేవలం స్త్రీలసభఅయితే లేచి అనర్గళంగా ఉపన్యసించి నీకు హడలెత్తిస్తాను.

సావి:—అట్లనా? నీధైర్యము నాకుతెలియదూ! సభలోనుంచోడముతోటే నీశరీరమంతా చెమట పోస్తుంది. నోరుతెరవలేవు. గడగడ వణకిపోతావు.

రతి:—(గట్టిగా నవ్వి) సోదరీ! నిజంగా నాస్థితి అంతేఅవుతుంది. అయితే నీవు అక్కడగూడా ఈవిధంగా అనర్గళంగా మాట్లాడగలవా?

సావి:—భయమెందుకు? ఎవరేమంటారు?

రతి:—నేనయితే ఒకఅక్షరమైనా చెప్పలేను. చెపుదామనుకున్నా నోటినుండి మాటరాదు. నాల్గు వైపులా మనుష్యులనుజూచే గాభరాఅవుతాను.

సావి:—ఇదే ఘోషావల్లవచ్చే మొదటిఅనర్థకం. ఇదే స్త్రీలను అబలనుచేస్తుంది. దీనివల్లనే వారి యుత్సాహము పోతూయుంటుంది. వారేదయినా సంకటములోబడి సర్వనాశనమైపోవుచున్ననూ,...ఆఖరుకు ప్రాణముపోవుచున్ననూ కాస్త ధైర్యముతో ఎదుటవానితో మాట్లాడలేరు. కాస్త గోలన్నా చేయలేరు. ఈఅనర్థకమంతా ఘోషావల్లనే.

రక్షు:—ఇటువంటిస్థితిలో నీవేమిచేస్తావు?

సావి:—ఎవడైన్నా కుదృష్టితో నన్నుజూచినచో బూటు (చెప్పు) తో నెత్తివాయగొడతాను.

రక్షు:—చెప్పంట సులభంకాని సమయంలో చెయిలేవదు. ధైర్యమూయుండదు.

సావి:—ఇప్పుడు నానోటితో ఏమిజెప్పేది. అటువంటిసమయంవచ్చినచో చేయి లేస్తుందో లేదో, ధైర్యముంటో లేదో నీకే తెలుస్తుంది. (బండి నెమ్మదిగాపోవటంచూచి) వజీరాబాద్ స్టేషన్ వచ్చింది. ఇక్కడ మీరుదిగి మరొకబండిలో ఎక్కాలి. నేను సరిగా లాహోరువెళ్ళుతాను. ఉత్తరం తప్పకవ్రాయాలి. నాఅడ్రసు పుస్తకములోఉంది.

రక్షు గుడ్డ సరిచేసుకుని నుంచుంది. ముఖముపైకి మునుగులాక్కుంది. సావిత్రిజూచి నవ్వింది. "అయితే నన్ను సయాల్ కోట రమ్మంటావా? వద్దంటావా?" అంది.

రక్షు:—(మునుగులోనుంచి ఆమెపైపుజూచి నెమ్మదిగా) ఎందుకురావు? తప్పకుండారా! నేనుచిరునామా వ్రాసిపంపుతాను. ఇంతలో బండి పూర్తిగానుంచుంది.

సావి:—నాషరతు నీకు స్వీకారమేకదూ? నీవు సభలో ఘోషాకువిరుద్ధంగా జెప్పాల.

రక్షు:—(నెమ్మదిగా) ముందునీవు ఎవరినైనా చెప్పుతోకొట్టిచూపించు. తర్వాత నేనుగూడాఘోషా చెడ్డది...కాని.

వాక్యము పూర్తికానేలేదు. రక్షాదేవిపతివచ్చి పెట్టెకెదురుగా నుంచున్నాడు. రక్షు మునుగును మరికాస్త పొడిగించి బండిదిగింది. సావిత్రి గట్టిగానవ్వి "కానరాక పడిపోయ్యేరు" అంది. ఇంతలో చాలామందిస్త్రీలువచ్చి ఈపెట్టెలోనే ఎక్కేరు. సావిత్రి చూస్తూఉంది.

రక్షాదేవి సరిగా చూచిపోవుటకు మునుగడ్డమైనందువల్ల జనములో త్రొక్కిళ్ళుపడుచూ నిశ్శబ్దంగా భర్త వెనువెంటనే పోతూయుంది. నవయౌవనుడునూ అనుభవశూన్యుడునైన రక్షాదేవిపతి గుంపును తనచేతులతో యిటునటునెట్టుచూ ముందుకు సాగిపోతూయున్నాడు. పాపము ఒకసారి ముందుముందు తనసామాను తీసుకెళ్ళు కూలివానివంక చూస్తాడు, ఒకసారినిండామునుగువైచుకొని తనవెనుక నేవచ్చుభార్యవంక చూస్తాడు. ఇంతలో పతి వలుగురైదుగురుమనుష్యులను దాటి ముందుపోయినందున రక్షు మునుగునుకొంచెముపైకెత్తి నలువైపులజూచింది. కాని ఆమె తనపతిని గుర్తించలేకపోయింది. "ఎటువెళ్ళేరు? ఇప్పుడు నాముందరనేవెళ్ళుతున్నారు. నేను వారివెనుకనే ఒకనిమిషమైనా ఆలస్యముచేయకుండా వస్తూయున్నాను. ఎటు వెళ్ళియుంటారు? బహుశా వెనకబడియుంటారా?" అనుకుని నుంచుంది. వెనుకకు తిరిగిచూచిందికాని నిర్భయో జనం. ప్రయాణీకులు ఇటునటు హడావిడిగా పరుగెత్తుచున్నందున ఆమె అక్కడనుంచునుట దుస్సహమైంది. చాలాకష్టంగా ఆగుంపులోనుంచి బయటబడి తలవంచి యొకచోటనుంచుంది. తనభర్త వెతకుతూ తనవద్దకు వచ్చునని ఆశించింది. కాని చాలాసేపయింది. ఇంతవరకూ రాలేదు. రక్షాదేవి భయపడ్డది. తనభర్తను ఎట్లా వెతకాలి? ఆమె ఆయనను సరిగానైననూచూడలేదు. తనభర్త బాదామీరంగుగల బూటుధరించేడని మాత్రమూ మెకు తెలుసు. చూస్తూయుండగానే అనేకమంది బాదామీరంగు బూటువారువచ్చేరు. వెళ్ళిపోయ్యారు.

ఆమెవద్ద ఎవరూ నుంచోనలేదు. బండినిండా మనుష్యులే. తనభర్త ఎక్కడా కాన్పించడు. ఎక్కడఉన్నాడు? బండి యీలవేసి బయలుదేరింది. రక్షాదేవి తనప్రాణముపోవుచున్నట్లు భావించింది. ఇప్పుడామె రక్షింపబడుటకు ఏయుపాయముకాన్పించలేదు. ఆమె ముసుగుపైకెత్తి పోవుచున్నబండివంక జూచి బండిఆగుటకు పరమాత్ముని ప్రార్థించింది. కాని భగవంతుడామె మొరను ఆలించలేదు.

ప్లాట్‌ఫారం జనశూన్యమయింది. ఇప్పుడే ఇంతకుముందే అక్కడ ఎంతో కోలాహలంగాఉంది. ఎంతజనముండి?...కాని ఇప్పుడు అనిర్భాగ్యురాలును, అల్పవయస్కురాలును అగు నాబాలికతప్ప మరెవ్వరును లేరు. రక్షాదేవి గోడవంక ముఖముత్రిప్పుకొని తన దౌర్భాగ్యమునకు వెక్కివెక్కి ఏడ్చుటమొదలుపెట్టింది.

౨

సాయంసమయము. ఒకరైల్వేకర్మచారి తనయింటికిపోవుచూ మన రక్షయున్నవైపుకేవచ్చేడు. రక్షాదేవినిజూచి "ఈమె ఎవ్వరు? ఎవరు మనిషిగూడా దగ్గరలేడు. ప్లాటుఫారమంతా జనశూన్యంగాఉంది. ఈమె ఒంటరిగా ఇక్కడేమిచేయుచున్నది?" అని అనుకున్నాడు. వెంటనే వానికి జ్ఞాపకమొచ్చింది. "నేనీమెను మధ్యాన్నమప్పుడుగూడా చూశాను. ఆసమయంలోగూడా ఈమెవెంట ఎవ్వరులేరు"...రైల్వే బాబు మెల్లమెల్లగా ఆమెవద్దకు జరిగేడు. రక్ష వాని పాదధ్వనివిని ఉలికిపాటుతో, అతని పాదములవంక జూచింది బాదామీరంగుబూటేమోనని. కాని ఆభాగ్యమెక్కడ? రక్ష యొకనిట్టూర్పువిడిచి తలవంచింది.

బాబు:—(రక్షను రెప్పవాల్చకుండాజూచి) నీవు ఇక్కడేమిచేయుచున్నావు?

రక్ష ముసుగును ఇంకాపొడుగుచేసింది. ఏమియు సమాధానముచెప్పలేదు.

బాబు:—నీవెంట ఎవ్వరైనా పురుషుడున్నాడా లేడా?

రక్ష ఎవ్వరూలేరను అర్థముతో తలయూపింది. రైల్వేబాబు తననోట్లోయున్న సిగరెట్టువంకజూచి, గట్టిగా ఒకదమ్ముపీల్చేడు. "నీవు యిక్కడకు ఒంటరిగా ఎట్లావచ్చేవు? ఎక్కడనుంచివస్తున్నావు"

రక్ష:—(అస్ఫుటస్వరంతో) గుజరాతునుంచి.

బాబు:—నీటిక్కెటు ఎక్కడఉంది? ఉన్నదా లేదా?

టిక్కెట్టుమాట వినుటతోడనే రక్షాదేవిముఖము వాడిపోయింది. మాట్లాడవలయునని ప్రయత్నించినా మాట్లాడలేకపోయింది. నిన్నటిరోజున ఈసమయంలోనే తనయింట్లో ఎంతసుఖముగాఉన్నదియూ జ్ఞాపకమొచ్చింది. కాని నేడో?...రక్షాదేవికన్ను లశ్రువులచేనిండిపోయినవి. ఇకముందేమవుతుంది? ఆమెకన్నుల ముందంధకారము వ్యాపించింది.

బాబు:—నీటిక్కెట్టు ఎక్కడఉందో చెప్పుదువా లేదా?

రక్ష గడగడ వణకప్రారంభించింది. "బాబూ! నన్ను కరుణించు. నిన్ను పరమాత్ముడు రక్షించుగాక" అంది.

బాబు:—(బెదరించి) టిక్కెట్టు యివ్వు?

రక్ష:—(ఏడ్చుచూ) వారివద్దఉంది.

బాబు:—(క్రోధంతో) అయితే వారినిపిలువు. ఎక్కడయున్నారో?

రక్ష:—(వ్యాకులితహృదయంతో) బాబుగారూ! ఇప్పుడెక్కడయున్నారో నాకెట్లా తెలుస్తుంది? గుంపులో తప్పిపోయారు. ఎక్కడకువెళ్ళేరో తెలియదు.

బాబు:—ఎంత విచిత్రమయినమాట! పురుషుడు తనక్రొత్తభార్యను వదలిపోవునా? మంచిది! దీనితో మాకేమి? బండిచార్జి యివ్వు.

పిల్లిపంజాలో చిక్కిన ఎలుకకుగూడా ఇటువంటిస్థితి సంభవించదు. మనస్సులో ఈఆపద ఏవిధముచే నయినా దాటవేయుమని భగవంతుని ప్రార్థించింది. "ఈసమయంలో సావిత్రివచ్చినచో ఎంతబాగుండును" అని అనుకుంది.

బాబు నలువైపులా జూచేడు. బొత్తిగా నిశ్శబ్దంగాఉంది. అప్పుడు రక్షాదేవికి ఇంకాదగ్గిరగావచ్చి నెమ్మదిగా "సరే...వంటే నాజేబులోనుంచి తీసియిచ్చి రశీదుతీసుకుంటాను. ఒకమారు చిరునవ్వుతో 'సరే' నను. నష్టమేముంది? అదే నాకు చాలాసంతోషము" అన్నాడు.

రక్షాదేవి చెవులలో సీసముపోసినట్లయింది. ఇటువంటి కపటప్రపంచమును ఆమెఎప్పుడుఎదుర్కొనుట తటస్థించలేదు. ఆమెకు రైల్వేబాబు మెడను నులిమివేత్తామా అనిపించింది. క్రోధముంది కాని సాహసములేదు. నిర్బలునికి క్రోధమొచ్చినచో ఏడ్పును. ఇంతకంటె ఏమియుచేయలేడు. రక్షగూడా ఏడుస్తోంది. ఇంతలో ప్లాటుఫారం రెండవవైపునుంచి యొకస్త్రీ ఇటువైపే వస్తోంది. బాబుచూచి కంపించిపోయ్యాడు. చూస్తూ చూస్తూఉండగానే ఆమె తీరివద్దకవచ్చి నుంచుంది. రక్షాదేవికి ప్రాణములో ప్రాణమొచ్చింది. ఆస్త్రీ చెవి వద్ద ముఖముంచి "సోదరీ! నన్ను రక్షించు! ఈపిశాచి..."తరువాత ఆమెనోరుమూతపడ్డది. కాని ఆస్త్రీఅంతా తెలుసుకుంది. ఆస్త్రీకళ్ళనుండి అగ్నికణములు రాలుచున్నవి. ఆమె ఆబాబువంక క్రోధపూరితనయనములతో వానిని తింటుందోఏమి అన్నట్లుగాజూచింది. క్రోధముతో గద్దించి "నీకు తోబుట్టువులులేరా?" అంది.

కంఠస్వరము వినుటతోనే రక్షాదేవి ఆనందమున కంతులేదు. ఈమె సావిత్రియా? ఆమెకు పోయిన ప్రాణము తిరిగివచ్చింది. నీళ్ళలోమునిగిపోవువానికి ఒడ్డుదొరకినట్లయింది. ఇప్పుడామెకు ఏవిధమయిన చింతా లేదు. తనయింట్లో, తనతల్లియొడిలోకూర్చున్నట్లే భావించింది.

సావిత్రి రైల్వేబాబువంక రోషపూరితనయనములతో జూచుచూ "ఈవిధంగా కులాంగనలను కష్ట పెట్టుచున్నావే నీకు తోబుట్టువులులేరా?" అంది.

రైల్వేబాబు నెత్తిపై పర్వతం విరిగిపడ్డట్టయింది. అతనినోటినుండి యొకమాటైన రాలేదు. "ఈమె ఎవరో పెద్దయింటికన్యగాఉంది. ఇందులో సుశిక్షిత. లేనిచో ఇంత నిర్భయంగా, ఇంత స్వతంత్రముగా ఎప్పుడుమాట్లాడదు. ఇప్పుడేమిచెయ్యాలి? ఎట్లా తప్పించుకోవాలి?" అనుకున్నాడు. కొంచము సేపటికి "నేనేమన్నాను? టిక్కెట్టుయివ్వు? లేదా చార్జీయివ్వు అన్నాను. ఇంతే యిందుకే ఏడుస్తోంది" అన్నాడు.

సావిత్రి రక్షాదేవి ముఖమువద్ద చెవిపెట్టి "డబ్బు యివ్వమంటున్నాడా? మరేదయినా...అంటు న్నాడా?" అంది.

రక్షాదేవి ఆమెచెవిలో నెమ్మదిగా ఆగిఆగి "కొంచెమునవ్వు! నీచార్జి నావద్దనుంచిఇస్తాను. నామనస్సు కెంతో ఆనందంగాఉంటుంది" అన్నాడు అని చెప్పింది.

సావిత్రి ఈమాటలువినుటతోనే క్రోధావేశయై "నీపేరేమి?" అంది.

"నాపేరడిగేదానవు నీవెవరవు?"

సావిత్రి గ్రుడ్లెర్రజేసి "నేనెవరినో నీకెందుకు? నీవు పేరుచెప్పు" అంది.

బాబు భయపడ్డాడు. అయినను సాహసించి "ఏం బెదరిస్తావు? ఆమె టిక్కెట్టులేకుండా ఎందు కొచ్చిందో అడగవేం?" అన్నాడు.

సావిత్రి ముందుకువచ్చి బాబు మెడపట్టుకుని కదలించి "నీవు నీపేరుచెప్పుదువా లేదా? నీపేరేమి? నేను నీపై రిపోర్టుచేస్తాను" అంది.

మనుష్యుడు నిరాశాహృదయుడైనప్పుడు సాహసించుతాడు. ఆదేవిధంగా బాబు సాహసికుడయ్యాడు. వెంటనే సావిత్రి చెయ్యిపట్టుకుని తీసివేసి "జాగ్రత! నేను తగ్గిపోయినకొలదీ నీవు పైకిపోవుచున్నావు. నేనే మయినా అన్నచో నీమర్యాదేమియునుండదు. రిపోర్టుజేసుకో. నాకేమియు భయములేదు" అన్నాడు.

సావిత్రి ఇక సహించలేకపోయింది. తక్షణమే కాలినుండి బూటుతీసి బాబునెత్తిపై నాలుగైదు మార్లు ప్రయోగించింది. ఈకోలాహలమంతా విని రైల్వే కర్మచారులు కొందరువచ్చి దూరంగానుంచుని తమాషాచూస్తూన్నారు. అందులో కొందరు ఆ! ఆ! అంటూనేయున్నారు. ఇంతలో బాబుగారి బుర్రకు బాగామరమ్మత్తయింది. సావిత్రి ఆకస్మాత్తుగా బూటుతో మీదబడి కొడుతున్నందువల్ల బాబుకు ఏమిచెయ్యవలసిందియూ తోచలేదు. ఇంతలో రైల్వేబాబులు మెల్లగా దగ్గరజేరి "అమ్మా! మీరు చెప్పుతో కొట్టడం బాగాలేదు" అన్నారు.

సావిత్రి తీవ్రకంఠస్వరంతో "మీరు చెప్పుతో అంటున్నారు. వీడు ఇక నోరు మెదపిన వీని రక్తము పిండుతాను. వీడు కులవధువులను అవమానపరచుచున్నాడు" అంది.

బాబు నిశ్శబ్దంగానుంచుని రొప్పుచున్నాడు. నోటినుండిమాట వెలువడడంలేదు. మరొకబాబు ఇతని చెయ్యిపట్టుకు ఎట్లనో బయటికిలాగేడు.

రెండోబాబు:—ఇతనికి దయ్యంపట్టింది. మేము ఇతనికి చెప్పిచెప్పి అలసిపోయాము. ఎవ్వరిమాట వినడు. మీరతనిని బాగాశిక్షించేరు. జ్ఞాపకముంటుంది.

మూడవబాబు:—సోదరీ! నాకు చాలాసంతోషమైంది. కులీనులగుస్త్రీలను కుదృష్టితోజూచువాడు ఎన్నడు మానవసహానుభూతికి పాత్రుడుగాజాలడు. ఇందువల్ల నేవాడు నిశ్శబ్దంగా ఊరుకున్నాడు. మేమంతా విరోధులమని నోరెత్తితే వీరంతా మీదపడతారని వాడికి తెలును.

నాల్గవబాబు:—తమరు చాలా సాహసంగా పనిచేశారు. ఇదేవిధంగా ప్రతినెల రెండుమూడు జరుగుతూయుంటే దుర్మార్గులకు బుద్ధివస్తుంది.

3

తర్వాత సావిత్రి, రక్షాదేవి ఒకబల్లపైకూర్చున్నారు. "నీవు ఇక్కడకు ఎట్లావచ్చేవు? నీవులాహోరు చేరిపోయియుంటావనుకున్నాను" అంది రక్ష.

సావి:—లేదు! నీవు అటువెళ్ళుటతోనే యొక స్నేహితురాలుకాన్పించి వెళ్ళనీయనందున సాయంత్రం బండికివచ్చెదనని వారికి టెలిగ్రామిచ్చి ఆమెయింటికివెళ్ళి మరల ఈబండికివెళ్ళుదామని వచ్చుచున్నాను.

రక్షాదేవి సావిత్రి ధైర్యసాహసములుచూచి ముగ్ధురాలైపోయింది. ఈమె రాకపోయినచో తనగతి యేమయేదో అని చింతించింది. ఈఆపదలో తనను రక్షించినందులకు ఆమెను ఎంతో పొగిడింది.

ఇంతలో సయాల్ కోటనుంచి బండివచ్చింది. అందులో రక్షాదేవిపతికూడా వచ్చేడు. పాపము వ్యాకులహృదయంతో బండిదిగేడు. ముఖము కళావిహీనంగావుంది. బండిదిగుటతోనే యిటునటూ వెదుకుట ప్రారంభించేడు. సావిత్రి వానిని జూచుచుటతోనే గుర్తించి సైగతో దగ్గరకు పిలచింది. "తమవస్తువేదయినా పోయిందా?" అన్నది.

రాంజీదాస్:—ఆఁ! అవును! ఏమిచెప్పేది? నాకళ్లు...ఇంతలో ప్రక్కనే కూర్చునియున్న రక్ష వంక జూచేడు.

సావిత్రి:—ఆఁ! చెప్పండి! తమరు ఎందుకు ఆగుతారు?

రాంజీదాసు జవాబుచెప్పలేదు. నిశ్శబ్దంగా రక్షవంకజూచుచున్నాడు..."బహుశా! యీమెయే అయివుంటుందా?"అనుకున్నాడు.

సావిత్రి:—(కనుబొమలుముడిచి) తమరు అటుఏమి చూచుచున్నారు? ఘోషాస్త్రీలను ఆవిధంగా రెప్పవాల్చకుండా చూచుచున్నావు. నీకు సిగ్గుగాఉండలేదా? ఎవరైనా పోలీసువానిని పిలువవలయునా?

రాంజీదాసుముఖము మలినమయింది. గద్గదకంఠముతో "నాభార్య తప్పిపోయింది. ఆమెనికూడా యిటువంటిగుడ్డలే. ఇట్లేమాదిరిఉంటుంది"అన్నాడు. ఈమాట చెపుతూయుండగానే అతనికళ్లవెంట నీళ్లు కారినవి.

సావిత్రి:—(చిరునవ్వుతో) స్త్రీపోయిందీ! చాలాతమాషైనమాటే. పాపము యీదిక్కులేనిపిల్లకు గూడా భర్తతప్పిపొయ్యాడట. మీరు సయాల్‌కోటనుండి వచ్చుచున్నారా ఏమి? అయితే చూచి గుర్తించండి! మీస్త్రీ అవునో? కాదో?

రాంజీ:—(సందిగ్ధంగా) ఈమెను ఏమిగుర్తించుతాను? గుడ్డలుమట్టుకు గుర్తించుతాను. ఇదేమాదిరి గుడ్డలు. ఈమెయే ననుకొంటాను.

సావిత్రి:—చాలావిచిత్రంగాఉంది. భర్తను భార్య గుర్తించలేదు. భార్యను భర్త గుర్తించలేదు.

రాంజీదాసుకు ఆమెయే తన స్త్రీయని దృఢమయిన నమ్మకముతోచింది. సంతోషహృదయంతో "సయాల్‌కోటనుంచి యింటివరకూ ఎట్లావచ్చేనో ఆపరమాత్మునికే తెలియాలి. ఇప్పుడు నాదుఃఖము దూరమైంది"అన్నాడు.

సావిత్రి:—ఈమెయే మీస్త్రీయని ఎట్లాగ్రహించేరు? అవునో? కాదో?

రాంజీ:—సోదరీ! పరిహసించవలదు. చాలాడస్సిపొయ్యాను. ఇంతవరకు మనస్సుఎట్లానోయుంది.

సావిత్రి:—నీవు ఈమెనువదలి వెళ్లినప్పుడు యీమెసంతోషించింది గాబోలు!

రాంజీ:—నేనేంచెప్పేది? గుంపులో వెళ్లుతూ బండిదగ్గిరకుజేరేము. ఇంతలో ఒకస్త్రీ జనానా పెట్టెలో ఎక్కుతూయుంది. ఇదేవయస్సు. ఇవేగుడ్డలు. నేనీమెయే అనుకున్నాను. ఇకనిర్భయంగా ప్రక్కనేయున్న పెట్టెలో ఎక్కేను. సయాల్‌కోట వెళ్లినతర్వాత సంగతంతా తెలిసింది.

సావిత్రి:—వెళ్ళండి! మరుగత్రికొంచెము మీతాయితీసుకరాండి, నోరు తీపుగాంది ఈమెను యివ్వను...కాని సయాల్‌కోటవరకూ తీసుకెళ్ళగలవా?

రాంజీ:—ఎందుకు? యింకా సందేహమా?

సావిత్రి:—మార్గంలో ఎక్కడయినా పోగొట్టుకొందువేమోయని నాకుభయంగాఉంది. రమ్మంటే మీవూరువరకూవచ్చి పంపుతాను.

రాంజీ:—సోదరీ! ఇంకానన్ను లజ్జితునిజేయవలదు. ఈశిక్ష జన్మపర్యంతముంటుంది.

తరువాత సావిత్రిజరిగిన కథంతా చెప్పింది. అంతావిని సావిత్రిని ఎంతోపొగిడి "తమయీఉపకారమునకెల్లపుడు కృతజ్ఞుడను. ఇటివంటి సాహసమే స్త్రీలందరికిఉన్నచో ఏకష్టముండదు"అన్నాడు.

సావిత్రి:—ఇదంతా మీమగవాళ్ల చేతులోనేయుంది. ఇక నేవెళ్లుతాను బండివేళయింది.

రాంజీ:—(ఉత్కంఠతతో) తమ అడ్రసునుయిచ్చినచో మాసోదరునికి యొకకృతజ్ఞతాపత్రమైననూ వ్రాయుటకు వీలుండును.

సావిత్రి:—అడ్రసు రక్షవద్దయుంది. కృతజ్ఞతాపత్రము మాటటుంచండి. ఆయన వకీలు [illegible]రికి ఫీజు కావాలెకాని కృతజ్ఞతాపత్రముకాదు. ఇంతపెద్దపనిజేశాము. ఫీజువదలరు" ఇట్లనిరక్షాదేవివద్ద సెలవుతీసుకుంది.

౪

కొన్ని నెలలు గడచినవి. సావిత్రి, రత్న మరల రైలుబండిలోనే కలియుటతటస్థించింది. కాని యీ రత్న మునుపటిరత్నకాదు. ఆమెను జూచినచో ఏదో స్వతంత్రజాతిమహిళామణిలాగా కాన్పించుచున్నది. ఘోషాగాని, మునుగుగానీ నామమాత్రంగూడాలేదు. ఆమెవెనుకనే కూలివాడు సామానుతీసుకుని వచ్చుచున్నాడు. ఆమెసరిగా సావిత్రియున్న పెట్టెవద్దకేవచ్చినుంచుంది. కూలివానిచే సామానులోపలవేయించి, డబ్బులెక్కించి వానికిచ్చిపంపివేసింది.

సావిత్రి ఈదృశ్యమును కూర్చుని ధ్యానపూర్వకంగా చూస్తోంది. కొంచెముసేపటికి ప్రసన్నహృదయంతో "హా! సోదరీ! చాలావీరవనితవయ్యావే!"అంది. రత్నయులికిపాటుతో తలపైకెత్తింది. సావిత్రి ఎదుటనుంచుని నవ్వుతూయుంది. రత్నవెంటనే ఆమెమెడ కౌగలించుకుని "సోదరీ! మనమిద్దరము మరల కలియుట అసంభవమని చాలానిరాశపొందేను. మీయింటికి రెండుమార్లు వెళ్లేను, కాని రెండుమార్లు నీవుపట్నములోనేలేవు. ఈరోజున ఆకస్మికంగా మనమిద్దరముకలియుట తటస్థించింది. నాకెంతో సంతోషంగా ఉంది"అంది.

ఇంతలో రాంజీదాసువచ్చి "సామానుసరిగాఉంచేవా?" అన్నాడు. రత్న చిరునవ్వుతో "చూడండి! సోదరిదొరికింది. నమస్కరించండి, మరల ఏస్టేషన్‌లో దిగిపోతుందో"అంది.

రాంజీదాసు తలవంచి సావిత్రివంకజూచి నమస్కరించి "రెండుమార్లువచ్చేను. కాని మీరు కానుపించలేదు"అన్నాడు.

ఇంతలో బండియీలవేసింది. సావిత్రి నమస్కారమునకు ప్రత్యుత్తరమిచ్చుచూ "మంచిది! తమరు వెళ్లి కూర్చోండి. బండిబయలుదేరుతుంది"అంది.

రాంజీదాసు వెళ్లిపొయ్యాడు. బండిబయలుదేరింది. సావిత్రి "అమునుగు ఎక్కడపోయింది?"అంది రత్నతో.

రత్న చిరునవ్వుతో "వజీరాబాదుస్టేషన్‌లో ఆరోజు నేపోయింది"అంది.

సావి:—కాని ఈపరివర్తన మెట్లాజరిగింది?

రత్న:—ఆకథంతా చాలా పెద్దది. సోదరీ! నేనీస్థితిలోనికి వచ్చుటకు ఎన్నెన్నికష్టములు వచ్చినవి? వారు గావున అవన్నిదాటగలిగేరు, గాని మరొకరైనచో సాహసించలేరు.

సావి:—సోదరీ! ఏదీ! ఆకథంతా సంగ్రహంగాచెప్పు. వినవలెనని కుతూహలంగాఉంది.

రత్న:—సయాల్‌కోటచేరగానే వారు యింట్లోవారితో ఇక ఘోషాలో ఉంచనని ఖుట్టిగాచెప్పేరు. ఇంట్లోవారు యీమాటవినుటతోనే ఆశ్చర్యములో మునిగిపొయ్యారు. తమ పిల్లవాడు ఈవిధంగా చెప్పునని వారు కలనైనాభావించలేదు. చాలారోజులవరకూ నెమ్మదిగా బోధించుచూవచ్చేరు. కాని ప్రయోజనమేమీ లేకపోయింది. పైగా మీమాటప్రతీది వింటాను కాని ఘోషావిషయంలో మాత్రంవినను అని ఖండితంగా చెప్పేరు. రెండురోజులవరకూ ఈచర్చజరుగుతూనేయుంది. మూడోరోజు ప్రాతఃకాలమే నన్నుబయటికి షికారుతీసుకెళ్లేరు. మరల యింటికి వచ్చేవరకు అందరిముఖకళలు మారిపోయియున్నవి. ఒకరుగూడా మాట్లాడలేదు.

తరువాత నావిషయంలో ఏమేమిజరిగినవో అవి నాకెతెలుసు. ఇల్లాంతా నాకువిరోధమయింది. ఒకరుగూడా అనుకూలంలేదు. అన్నంతిన్నావా? లేదా?అని అడిగేవారుగూడాలేరు. నేను రోజంతయూ ఏడుస్తూకూర్చుంటాను. ఈవిధంగా పదిహేనురోజులు గడచిపోయినవి.

సాయంసమయము. ఆకాశమంతా మేఘావృతమైయుండి. మామగారు బయటినుంచివచ్చేరు. వచ్చుట తోడనే "ఏం, ఎక్కడున్నావు?"అన్నారు. అత్తగారుగదిలో గూర్చుని బావగారికూతురుకు తలదువ్వుతూ ఉంది. వినుటతోనే బయటికివచ్చి "ఎందుకు? ఏమిటీకోపంగాఉన్నారు?"అంది.

మామ:—కోపంగాఉండక ఏమిచెయ్యాలి? పిల్లవాడు నామర్యాద మంటగలిపేడు. బజార్లో అందరునవ్వుచున్నారు. నేను బజారున పోవుచుంటే నావంక వ్రేలెత్తి చూపుచున్నారు. విషముద్రాగి చచ్చిపోదామా అనిపిస్తోంది.

అత్త:—విషం మీవిరోధులు త్రాగాలి. కాస్తఘట్టిగామాట్లాడితే ఇక నెవ్వరునోరెత్తరు.

మామ:—నేనెవరితోనని పోట్లాడేది? బజారంతానవ్వుతుంది. ఇవ్వాళ ఏదోయొకటి పైసలు కావలసిందే. రాంజీయింట్లోయున్నాడా? లేడా?

ఇంతలోవారు రానేవచ్చేరు. నాకుభయమేసింది. మామగారు వారిని జూచుటతోనే "యీనిర్లజ్జతా వ్యవహారం ఇకనాయింట్లోసాగదు. నీభార్యను ఘోషాలోఉంచెదవా? నాయింట్లోనుండి నడచెదవా? ఏది నీకిష్టము?"అన్నారు. వారు కొంచెముసేపటికి "ఘోషా యింతప్రియమైందా?"అన్నారు.

మామ:—ఇంతకంటెగూడా ప్రియమైంది. పుత్రుడుగూడా దీనిముందు ఒకలెక్కగాదు. దీనిని నీవు ఘోషాఅంటున్నావు. నేను దీనిని ప్రతిష్టగా భావించుకొనుచున్నాను.

వారు:—మంచిది నేను యిల్లువదలుతాను.

ఏమిగానున్నదోయని నాహృదయము వ్యాకులపడ్డది. ఇంతలో అత్తగారు "తండ్రిఎదుట ఈవిధముగా జెప్పుట నీకు సిగ్గుగాలేదా? మీయిష్టమొచ్చినట్లేచేస్తాను అని చెప్పలేవూ? తల్లితండ్రియుండగా కోడలి విషయంలో నీవునోరుగూడా మెదపగూడదు. ప్రపంచములో అందరికిపెళ్లిళ్లు అయినవికాని నీవంటినిర్లజ్జగల వాడెవ్వడూయుండడు"అంది.

మామ:—అయితే! ఇంతే నిశ్చయించుకున్నావా? చూడు పశ్చాత్తాపపడతావు. బాగావిచారించుకో.

వారు "నేను విచారించుకోవలసిందేదో విచారించుకున్నాను" అన్నారు దృఢంగా.

మామ:—అయితే దయచేయండి! తమస్త్రీనిగూడా వెంటబెట్టుకొనివెళ్ళండి. ఈరోజునుంచి నాకు నీవు చచ్చిపోయ్యావు. నీకు నేను చచ్చిపోయ్యాను"అంటూనే గదిలోకివెళ్లేరు. అత్తగారు ఏడ్చుచూ అనేక విధముల కుమారునకుబోధించిరి. కాని లాభములేకపోయింది. చూస్తూవుండగానే ప్రయాణమయ్యారు. ఇంట్లోవస్తువేదిగూడా వెంటతీసుకోలేదు. వివాహసమయంలోవచ్చిన వస్తువులుగూడా ముట్టుకోలేదు. నావద్దకు వచ్చి "పద"మన్నారు.

నేను వెంటనేలేచి నుంచున్నాను. వారు తల్లితో "చూడు అంతాఇక్కడే వదలిపోతున్నాను"అన్నారు.

తల్లిఏమియుసమాధానముచెప్పలేదు. తలవంచినుంచుంది. కాని వదినెగారుమాత్రం ఊరుకోలేదు. "ఎట్లా వదలిపోతున్నా ఆమె ఉందిగా శరీరంనిండా సొమ్ములతో"అంది వ్యంగంగా.

"ఆవస్తువులుగూడా తీసిఇవ్వు. ఈరాక్షసికళ్లు చల్లబడతవి"అన్నారు. నేను నిశ్శబ్దంగావస్తువులు ఊడదీయుచున్నాను. అత్తగారు ఏడ్చుచూ "అమ్మా! ఉండనివ్వు! అయ్యో! ఏమిపనిచేయుచున్నావు? పిచ్చిదానవయ్యావా?"అంది. "తీసిఇవ్వు! భగవంతుడిచ్చినవో ధరించుకుందాములేనివో లేదు"అన్నారు వారు.

వస్తువులు తీసియిచ్చి వారివెంటనే బయటికివచ్చేను. అత్తగారు ఏడుస్తూవుంది. బాజారుకువచ్చేవరకు ఆకాశంగూడా ఏడ్వడం ప్రారంభించింది. నేను నుంచుని వర్షముకురుస్తోందన్నాను. వారు నీవు కాకితపు బొమ్మవుగాదు తడిసి చెడిపోటానికి, నిశ్శబ్దంగారా అన్నారు.

రాత్రిసమయము. వర్షము కురియుచున్నది. రుంయ్యియని చల్లనిగాలి వీచుచున్నది. మెరపులు మెరయుచున్నవి. మేమిద్దరము ఇల్లువదలి, వర్షములో తడియుచూ, చలిలో వణకుచూ, స్టేషన్ వైపుకు వెళ్లుచున్నాము.

ఇంతవరకూ చెప్పి రత్న యూరకుంది. సావిత్రి సమ్మానపూర్వకంగా రత్నవంక జూచి "సోదరీ! మంచి సాహసము జేశారు. నేను మరదిగారిని ఇంతవారని తలపలేదు. వారిని ప్రశంసించవలసిందే" అంది.

ఇంతలో వజీరాబాదు స్టేషన్ వచ్చింది. బండినుంచునటలోనే రత్న సావిత్రి చేయిపట్టుకుని క్రిందకు దిగి అటు వెళ్లుదాం రా అన్నది.

సావిత్రి నిశ్శబ్దంగా ఆమె వెనకనే పోయింది. రెండు నెలల క్రిందట రత్న నిస్సహాయయై భగవంతుని ప్రార్థించుచూఉన్న చోటికి వెళ్లేరు. ఆసమయంలో ఆస్థలం ఎంతభయంకరంగాఉంది? రత్న సావిత్రితో "సోదరీ! నాయీపరివర్తనమునకు కారణమైన స్థలమిదే. ఇక్కడే నాబంధములు విడిపడ్డవి. ఈస్థలమే నాకు స్వతంత్రత దొరకుటకు మూలకారణమయింది. నాకు ఈస్థలము మందిరముకంటెగూడా పవిత్రమయింది.

ఇంతలో సావిత్రి ఒకరైల్వే బాబువంక చెయిజూపి "చూడు: ఆయనెవరో గుర్తించగలవా?" అంది.

"లేదు! ఎవ రాయన?"

సావి:—(చిరునవ్వుతో) నీ ఈమందిరముయొక్క దేవత. నేను పాద్యశాణపుష్పములతో, ఆరోజున పూజజేసిన బాబు. నీవు ఇంతలోనే మరచితివా? ఆయనకు నమస్కరించు.

మూగనోము

బొడ్డు బాపిరాజుగారు

"సకియ! ఈమనోహరశరత్సంధ్యలందు
ఏఫలంబునుగోరి చలింపనట్టి
దీక్ష నోములు నోతువో తెలియబలుకు
మతని చిరజీవిగాజేయువితముగాక?

చనువును జూపుచుండుదువు చానరో! మొన్నటిదాక; ఇంక నా
తనిని వివాహమై సరిగదాటదు వత్సర. మప్పుడే మమున్
గనియును పల్కరింపవిదిగర్వమొ? నాధునికెట్టి భాగ్యముల్
దనరినమాటలాడదగదా? పలుకే కనకంబ? నెచ్చెలీ!

దాపునజేరి; రాగభరితస్ఫురితాతివిలాసనేత్రవి
క్షేపములన్ నయించి; మధుశీకరసేచనమంజులప్రియా
లాపములంగరంచెడి కళానిధి నీపతి వచ్చుచో వ్రతో
ద్యాపనజేయజూడవుగ తత్సుముహూర్తమునన్ సవిస్మృతిన్?
అలలితస్మితానతకటాక్షము లేటికి? అకరాంగుళీ
చాలనమేల? అవిముఖసౌహృదమొందులకు? అత్రపాభరం
బేలనె; బేల? ముద్దులొలికించెడి మోవిదెరల్చి తేనియల్
జాలుకొనంగ ఒక్కనుడిచాలు వచింపుశ్రవఃప్రియంబుగా.